'మృదు'వుగా కళ్లెం!

క్యాబినెట్‌లో కట్టప్ప!

- నాడు నమ్మకస్తుడంటూ పొగిడిన ముఖ్యనేత
- పదవి మార్చితే ఆయనకే మొగ్గు అంటూ వార్తలు
- కట్టడికి అన్నివైపులా ముఖ్యనేత బంధనాలు
- సొంత శాఖలో పనులు జరగకుండా అడ్డంకులు
- అదే జిల్లా నుంచి మరికొందరు నేతలకు పదవులు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): 'ఈయన మృదుస్వభావి, తెలివైన వాడు. నాకు అత్యంత నమ్మకస్తుడు. నాకు పాలనాపరంగా ఏమైనా అనుమానాలు వస్తే ఈయననే సంప్రదిస్తా' అని ముఖ్యనేత తరుచూ పొగిడే వ్యక్తి. కానీ ఇప్పుడు అదే ముఖ్యనేత వ్యూహంలో చిక్కి మింగలేక, కక్కలేక అన్నట్టుగా ఆయన విలవిల్లాడుతున్నారు. మేలిమి పంట కోసం ఆసామి పొలంలో మెండు కొమ్మలను నరికినట్టు.. తన పదవిని కాపాడుకునేందుకు పోటీదారులుగా భావించిన ప్రతి ఒక్కరినీ ముఖ్యనేత పక్కకు తప్పిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు, పార్టీకి అత్యంత నమ్మకస్తుడని ఆయనపై ముద్ర ఉన్నది. రాష్ట్రంలోని సాధారణ కార్యకర్త నుంచి ఢిల్లీ పెద్దల వరకు అందరిదీ ఇదే భావన. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే కచ్చితంగా మంత్రి పదవి వరించే అవకాశం ఉన్న మొదటి మూడునాలుగు పేర్లలో ఆయనది కూడా ఒకటి. అనుకున్నట్టే ఆయనకు కీలకమైన, సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాల్సిన శాఖలనే కట్టబెట్టారు. ఆ తర్వాత ఎప్పుడూ ముఖ్యనేతతో కలిసి కనిపిస్తుండటం, వీలుచిక్కినప్పుడల్లా ఆ ముఖ్యనేత ఈయనను పొగుడుతుండటంతో అందరూ అంతా బాగుందని అనుకున్నారు. ఓ దశలో పాలనాపరంగా వెనుక ఉండి అంతా ఆయనే చూసుకుంటున్నారనే ప్రచారం కూడా సాగింది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి పదవిని మార్చుతారనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో పెద్ద ఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో రెండు మూడు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఇందులో నంబర్ టూ అని చెప్పుకునేవారు కూడా ఉన్నారు. అయితే వారి శాఖలపై అప్పటికే విచ్చలవిడి అవినీతి ముద్ర ఉండటంతో ప్రత్యామ్నాయ పేర్లు తెరమీదికి వచ్చాయి. ఇందులో ప్రముఖంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఈ నేత పేరు కూడా వినిపించింది. నమ్మకస్తుడు, మృదుస్వభావి, అందరినీ కలుపుకొని పోయే వ్యక్తిత్వం కాబట్టి పదవి ఇస్తే ఎవరూ అడ్డుచెప్పరనే స్థాయిలో ప్రచారం జరిగింది.

ఇంటా.. బయట కట్టడి

తనకు ప్రత్యామ్నాయం అనుకున్న వ్యక్తులందరినీ అసమర్థులుగా ముద్ర వేయిస్తున్నారని ముఖ్యనేతపై రాజకీయ వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ మంత్రిపై అవినీతి ముద్ర వేసేందుకు అవకాశం పెద్దగా లేకపోవడం, ఒకవేళ బలవంతంగా అవినీతి మరకలు అంటించాలని ప్రయత్నిస్తే నమ్మే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యనేత రూటు మార్చారని చెప్పుకుంటున్నారు. ఆయనను ఇంటా, బయట కట్టడి చేయాలని నిర్ణయించుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కావాలనో, కాకతాళీయంగానో తెలియదు కానీ ముఖ్యనేతతో సన్నిహితంగా మెలిగే బీజేపీ ఎంపీ ఒకరు కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి మార్పు జరిగితే సదరు మంత్రికే సీఎంగా అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇంకేముంది ముఖ్యనేతకు అభద్రతాభావం మొదలైంది. నొసటి చిట్లింపులు, పెదవి విరుపులు మొదలయ్యాయి. సదరు మంత్రిని కట్టడి చేయడమే లక్ష్యంగా వ్యూహరచన ప్రారంభమైంది. ముఖ్యనేత తన నమ్మిన బంటుగా ఉన్న ఒక కీలక అధికారిని హెచ్‌వోడీగా చొప్పించారని, ఆయన నియామకంపై సదరు మంత్రి అభ్యంతరం చెప్పినా వినిపించుకోలేదన్న చర్చ జరుగుతున్నది. ముఖ్యనేత ఆదేశాలు తప్ప ఎవరి ఆదేశాలనూ తాను పాటించాల్సిన అవసరం లేదని సదరు అధిపతి బహిరంగంగానే చెప్పుకుంటున్నట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వీరే కాకుండా విజిలెన్స్ అధికారుల నుంచి రోజువారీ ఇసుక వ్యాపారం వివరాలు తెప్పిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు ఆ నేత సొంత నియోజకవర్గానికి సంబంధించి కూడా ఎలాంటి పనులు జరగనీయకుండా ముఖ్యనేత అడ్డుపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. సదరు మంత్రి శాఖకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఆయనకు తెల్వకుండా బైపాస్ చేసి తీసుకోవడం ద్వారా డ్యామేజ్ జరిగాక బాధ్యతను ఆయన వైపు నెట్టడం నిత్యకృత్యంగా మారిందట. ఇదంతా ఆయనను బద్నాం చేసే వ్యూహంతోనే సాగుతున్నది.

శాఖ మార్చమంటావా?

అటు సొంత నియోజకవర్గంలో పనులు కాక, ఇటు తన పరిధిలోని శాఖల్లో విలువ లేక ఇదేం వ్యవహారమంటూ సదరు నేత అసంతృప్తితో ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్పాయి. ఇదే విషయాన్ని ప్రస్తావించేందుకు ముఖ్యనేత దగ్గరికి వెళ్తే, శాఖలు మార్చుదామంటూ ఉచిత సలహాలు ఇస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ పెద్దలకు నిధులు సమకూర్చే శాఖను అప్పగిస్తానని చెప్తున్నారట. ఇప్పుడున్న మంత్రిని మార్చేయాలని అధిష్ఠానమే చెప్తున్నదని, కాబట్టి ఆ పదవి తీసుకోవాలని సూచిస్తున్నట్టు తెలిసింది. దీంతో అలా ఎందుకు చెప్తున్నారో అర్థమై సదరు నేత తీవ్ర ఆలోచనలో పడ్డారని సమాచారం. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న మంత్రిపై ఒకప్పుడు అధిష్ఠానం పూర్తి సానుకూలంగా ఉండేదని, ముఖ్యమంత్రి అవుతారనే ప్రచారం కూడా జరిగిందని, కానీ ఏడాదిన్నరలో అవినీతి ముద్ర పడేలా చేయడంతో ఏకంగా పదవి నుంచి తొలిగించే స్థాయికి పరపతి పడిపోయిందని సదరు నేత విశ్లేషిస్తున్నారట. అలాంటి పదవిని తనకు ఆఫర్ చేయడమంటే తనను కూడా భ్రష్టుపట్టించే పన్నాగమా? అంటూ ఆయన వాపోతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పదవులతో బంధనం

తనకు పోటీగా మారే అవకాశం ఉన్న ఆ నేతకు జిల్లాలో కూడా చెక్ పెట్టాలని ముఖ్య నేత నిర్ణయించుకున్నట్టు చెప్తున్నారు. ఇందులో భాగంగా ఓ వర్గం ఎమ్మెల్యేలకు మంత్రి పదవి అనే అంశాన్ని ముఖ్యనేత తెరమీదికి తీసుకొచ్చారని, వినతులు, మెమోరాండం, విజ్ఞప్తులతో వారిని హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు తిప్పించి అధిష్ఠానం మీద ఒత్తిడి తీసుకొచ్చినట్టు పార్టీ నాయకులే చెప్తున్నారు. ఫలితంగా ఆ నేతకు చెందిన జిల్లాలోనే మరో ఇద్దరికి తాజా ఉన్నత పదవులు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి జిల్లాపరంగా చూస్తే ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న వారు నలుగురు ఉన్నారు. సొంత జిల్లా, ఉమ్మడి జిల్లాలో ఆ నేతను కట్టడి చేయడానికే వరుసగా పదవులు ఇచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో 'సమ్మిళిత జీవనోపాధి'

- సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమాన్ని(టీజీఐఎల్‌పీ) ప్రారంభిస్తున్నట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ సెక్రటరీ స్మితిశరణ్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, బ్రాక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో శనివారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రెండేండ్లపాటు అత్యంత వెనుకబడిన 6వేల కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించనున్నట్టు చెప్పారు.

మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ..

ఎంవోడబ్ల్యూవో స్వచ్ఛంద సంస్థ సహకారంతో సెర్ప్ ద్వారా హిళలకు ఉచిత బస్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు. శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం సచివాలయంలో ఆమె ఆవిష్కరించారు.

రైతు భరోసాకు అధికారుల కొర్రీలు

క్రాప్‌లోన్ చెల్లించాలని ఆంక్షలు

నిజాంపేట, జూన్ 21: రైతుభరోసాకు అధికారులు కొర్రీలు పెడుతున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటలోని సెంట్రల్ బ్యాంక్ నుంచి వ్యవసాయం, వివిధ అవసరాల నిమిత్తం నార్లపూర్, వెంకటాపూర్(కె), తిప్పనగుల్ల, రజాక్‌పల్లి, కల్వకుంట గ్రామాలకు చెందిన రైతులు రుణాలు తీసుకున్నారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు ప్రభుత్వం జమచేస్తుండగా పైసల కోసం బ్యాంక్‌కు వెళ్తున్న రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. క్రాప్‌లోన్‌తోపాటు వడ్డీ చెల్లించాలని లేకుంటే రైతుభరోసా పైసలు ఇవ్వలేమని బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

'ఏఐ'తో మానవరహిత వ్యవసాయమే లక్ష్యం

ఎం రఘునందన్‌రావు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫౌండేషన్ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం త్వరలో ప్రారంభించనున్న అరిసా(ఏఆర్ఐఎస్ఏ) (ఏఐ, రొబొటిక్, ఐవోటీ ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్) ల్యాబ్ అత్యవసరమైనదని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం రఘునందన్‌రావు అభిప్రాయపడ్డారు. దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయ వర్సిటీ ఇలాంటి సృజనాత్మకమైన ఆలోచన చేసి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో కూడిన ప్రయోగశాలను నెలకొల్పుతున్నందుకు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. శనివారం ఎస్‌బీఐ-అరిసా ప్రయోగశాల ప్రీలాంచ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐ సాయంతో వ్యవసాయంలో మానరహిత వ్యవసాయమే లక్ష్యమని తెలిపారు. వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. వచ్చే 20 ఏండ్లలో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని.. దీంతో ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

వచ్చే వారమే 'స్థానిక' షెడ్యూల్?

- రేపటి క్యాబినెట్ భేటీలో అదే ప్రధాన ఎంజెండా..!
- రైతుభరోసా నిధుల జమ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల?
- ఎన్నికల సన్నాహాల్లో బిజీగా తెలంగాణ ఎస్ఈసీ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగనున్నదా? వచ్చే వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడనున్నదా? అంటే అవుననే అంటున్నాయి అత్యంత విశ్వసనీయవర్గాలు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే మంత్రులతో జరిగిన సమావేశాల్లోనూ ఎన్నికల సన్నాహాలపై ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. అనవసర ప్రకటనలు లేకుండా, పూర్తి స్థాయిలో సిద్ధమవ్వాలని సూచించినట్టు సమాచారం. గ్రామ పంచాయతీలు సహా మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. రైతుభరోసా పథకం కింద నిధులు జమచేసే ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ వెలువడనున్నట్టు సమాచారం. ఈ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందించి గ్రామీణ ఓటర్ల మద్దతు పొందాలని చూస్తున్నట్టు తెలిసింది. అందుకే గత వేసవిలో మూడెకరాలకే రైతు భరోసా నిధులను విడుదల చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. గ్రామీణ ఓటర్ల కోసం ఇప్పుడు అందరికీ వేయాలని భావిస్తున్నది. సోమవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో రైతుభరోసా నిధుల విడుదల, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అంశాలే ప్రధాన ఎజెండా చర్చించనున్నట్టు తెలిసింది. రాజీవ్ యువవికాసం పథకం వాయిదా పడిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా పథకాలు తమను గట్టెక్కిస్తాయని కాంగ్రెస్ సర్కారు ఆశతో ముందుకు సాగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో కేసు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో కేసు పెండింగ్ ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్నికలకు ముందే రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికి కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (టీఎస్ ఈసీ) ఇప్పటికే ఎన్నికల సన్నాహాల్లో తలమునకలై ఉన్నది. 70,000 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయడంతోపాటు, ఓటరు జాబితాలు, పోలింగ్‌స్టేషన్ల వివరాలను ఖరారు చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో 12,815 గ్రామ పంచాయతీలు, 1.14 లక్షల వార్డులతోపాటు 538 జడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది.

మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు

- పలు ఫైళ్లపై సంతకాలు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి

మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అడ్లూరి

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు శనివారం సచివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 844మంది దివ్యాంగులకు రూ.5కోట్లతో స్వయం ఉపాధి కల్పించే యూనిట్ల మంజూరు, దివ్యాంగులకు స్వయంసహాయక సంఘాల ఏర్పాటు చేసి.. తద్వారా 2,367మందికి 3.50 కోట్లను పంపిణీ చేసే ఫైలుపై తొలి సంతకం చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు ఏటా 210మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి రూ.20లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. తాజాగా ఆ సంఖ్యను 500 పెంచగా.. అందుకు సంబంధించిన ఫైలుతోపాటు.. మరికొన్ని ఫైళ్లపై మంత్రి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అడ్లూరికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, సంజయ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గోపాలమిత్రలకు జీతాలేవి?

- 9 నెలలుగా వేతనాలు ఇవ్వని రేవంత్‌రెడ్డి సర్కారు
- భారంగా కుటుంబ పోషణ

హైదరాబాద్, జూన్ 21(నమస్తే తెలంగాణ) : మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన గోపాలమిత్ర వ్యవస్థ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతున్నది. పశువైద్య శాలలు అందుబాటులో లేని ప్రాంతాల్లో పాడిరైతుల ఇంటి వద్దే అత్యవసర సేవలు అందిస్తున్న గోపాలమిత్రలు సమస్యలతో సతమతమవుతున్నారు. తమకు ప్రభుత్వం నెలకు ఇచ్చే రూ.11,050 వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, ఇచ్చే జీతం కూడా 9 నెలలుగా రాకపోవడంతో తమ బతుకులు దినదినగండంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

23 ఏండ్లుగా సేవలు..

గత 23 ఏండ్లుగా క్షేత్రస్థాయిలో పాడిరైతులకు సేవలందించడంతోపాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ, సామాజిక కార్యక్రమాల్లోనూ గోపాలమిత్రలు భాగస్వాములవుతున్నారు. వాస్తవానికి గోపాలమిత్రలు పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు మాత్రమే అందించాల్సి ఉన్నప్పటికీ, పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న పశు గర్భకోశ వైద్యశిబిరాలు, నట్టలనివారణ, పశుగ్రాసాల పెంపకం, పశువులకు టీకాలు తదితర కార్యక్రమాల్లోనూ సేవలందిస్తున్నారు. ఇన్ని పనులు చేస్తున్నప్పటికీ తమకు సకాలంలో వేతనాలు అందడం లేదని వాపోతున్నారు.

కేసీఆర్ హయాంలో పెరిగిన జీతాలు..

తెలంగాణ ఏర్పడిన తర్వాత 2022లో నాటి సీఎం కేసీఆర్ వారి సేవలను గుర్తించి రూ.8,500 ఉన్న వేతనాన్ని రూ.11,050కి పెంచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ పెరగకపోవడంతోపాటు పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇన్నేండ్లుగా సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం 9నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సోదరుడి శంకుస్థాపనలు

- కొడంగల్‌లో తిరుపతిరెడ్డిదే హవా
- అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌కు మంగళం..!
- నామమాత్రంగా మారిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- వంతపాడుతున్న 'కడా' అధికారిపై సర్వత్రా విమర్శలు

మద్దూరు మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో అంతా ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి మాటే చెల్లుబాటు అవుతున్నది. ప్రొటోకాల్‌కు మంగళం పాడుతూ అన్నీ తానై అన్నట్టుగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అధికారులు సైతం అతనికే వంతపాడుతున్నారు. అధికార బలంతో వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా పాలనను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం ఒక సర్పంచ్‌గా కూడా గెలవని వ్యక్తితో అధికారిక కార్యక్రమాలు చేయించడం ఎంతవరకు సమంజసమని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం ముఖ్యమంత్రి సోదరుడు అన్న ఒకే ఒక కారణంతో నియోజకవర్గంలోని మెజారిటీ అధికారులు ఎర్రతివాచీ వేసి స్వాగతం పలుకుతుండటం గమనార్హం.

మున్సిపల్ ఆఫీస్ ప్రారంభించిన తిరుపతిరెడ్డి

నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్‌లో శనివారం నూతన మున్సిపాలిటీ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. నూతనంగా నిర్మించనున్న డిగ్రీ కళాశాల భవనానికి కూడా 'కడా' అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి తిరుపతిరెడ్డి భూమి పూజచేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ఎంతో కృషిచేస్తున్నారని కొనియాడారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు, ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

కోస్గిలోనూ ఆయన చేతులమీదుగానే..

నారాయణపేట జిల్లా కోస్గిలో రూ.305 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కూడా తిరుపతిరెడ్డి అన్నీ తానై చేయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం తిరుపతిరెడ్డి పర్యటనలో భాగంగా కోస్గి శివాజీ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు భద్రత పేరుతో సామాన్య ప్రజల వాహనాలను అటువైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. 'కడా' ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి సైతం ప్రోటోకాల్‌ను పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గ స్థాయి అధికారే ప్రొటోకాల్ పట్టించుకోకపోతే ఇక మండల స్థాయి అధికారుల ఎలా అమలు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రేషన్‌కార్డు అప్‌లోడ్‌కు 2,500 లంచం

ఏసీబీకి చిక్కిన తహసీల్ కార్యాలయ టైపిస్టు

ఏసీబీకి పట్టుబడిన నవక్రాంత్

బూర్గంపహాడ్, జూన్ 21 : రేషన్ కార్డుకు సంబంధించి అప్‌లోడ్ ప్రాసెస్ కోసం ఓ టైపిస్టు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ తహసీల్ కార్యాలయంలో శనివారం చోటుచేసుకుంది. మండలానికి చెందిన ఓ వ్యక్తి రేషన్ కార్డుకు సంబంధించి అప్‌లోడ్ ప్రాసెస్ కోసం బూర్గంపహాడ్ తహసీల్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సీహెచ్ నవక్రాంత్‌ను సంప్రదించాడు. అతడు రూ.4 వేలు డిమాండ్ చేయగా.. రూ.2,500కు ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం కార్యాలయంలో టైపిస్టుకు రూ.2,500 లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన బృందంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని వరంగల్‌కు తరలించారు.

బ్యాంకు లాకర్‌లోనే రూ.5 కోట్లు!

నూనె శ్రీధర్ అక్రమాస్తులకు కుటుంబసభ్యులే బినామీలు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో అరెస్టయిన ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ నుంచి శనివారం రెండో రోజు విచారణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పలు వివరాలను రాబట్టినట్టు తెలిసింది. శుక్రవారం తొలి రోజు విచారణలో శ్రీధర్ వ్యక్తిగత వివరాలు, కుటుంబ నేపథ్యం, వారసత్వంగా వచ్చిన ఆస్తుల గురించి తెలుసుకున్న అధికారులు.. ఆ సమాచారం ఆధారంగా రెండో రోజు బినామీల వివరాలను రాబట్టినట్టు తెలిసింది. శ్రీధర్ కుటుంబసభ్యులు బినామీలుగా ఉన్నట్టు తేలడంతో వారిని ప్రశ్నించనున్నట్టు సమాచారం. కాగా, బ్యాంకు లాకర్లను తెరిచి, దాదాపు రూ.5 కోట్లకుపైగా నగదును గుర్తించినట్టు తెలుస్తున్నది.

ఏఐ, ఆటోమేషన్‌పై అవగాహన పెంచుకోవాలి

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- జేఎన్‌టీయూలో ఎప్‌సెట్-2025పై అవగాహన

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, డ్రోన్స్, బ్లాక్ చైన్ వంటి నూతన సాంకేతిక రంగాలకు చెందిన కోర్సులపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు అనేక అవకాశాలతో నిండి ఉన్నదని, గ్లోబల్ మార్కెట్‌కి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో శనివారం ఎప్‌సెట్-2025పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్(సీఎస్ఈ) కోర్సుల్లో అధిక ప్రవేశాలు జరుగుతున్నాయని, కాని తక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటూ.. విద్యార్థులు కోర్ ఇంజినీరింగ్ గ్రూపుల వైపు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు హాజరయ్యారు. కరీంనగర్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి వంటి పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు.

యాసంగి రైతు భరోసా కథ కంచికేనా?

- గత సీజన్ బకాయిలపై నోరెత్తని కాంగ్రెస్ సర్కారు
- ఇంకా రూ.4 వేల కోట్ల నిధులు పెండింగ్
- ఒక్క సీజన్ సకాలంలో ఇచ్చామని గొప్పలు చెప్తున్న వైనం
- నేటివరకూ తొమ్మిదెకరాల వరకు మాత్రమే పంపిణీ

హైదరాబాద్, జూన్ 21(నమస్తే తెలంగాణ): వానకాలం రైతుభరోసాను శరవేగంగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్న కాంగ్రెస్ సర్కారు గత యాసంగి రైతుభరోసా బకాయిలపై మాత్రం నోరెత్తడం లేదు. ఆ బకాయిల చెల్లింపుపై ఎలాంటి ప్రకటన కూడా చేయడం లేదు. దీంతో యాసంగి రైతుభరోసాకు ప్రభుత్వం నీళ్లొదిలినట్టేనా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. గత యాసంగికి సంబంధించి 153 లక్షల ఎకరాలకు ఎకరానికి రూ.6వేల చొప్పున రూ.9,